అందుబాటులో ఆధార్ సేవలు

- వివరాల అప్‌డేట్, మార్పులు, చేర్పులకు అవకాశం
- 25 వరకు ప్రత్యేక శిబిరాలు


అంబేడ్కర్ కాలనీ సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న ఎడ్యుకేషన్, డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ ప్రభాకర్

మద్రిపాలెం: ప్రస్తుత జీవన విధానంలో ప్రతి మనిషికి ఆధార్ కార్డు తప్పనిసరిగా మారింది. బ్యాంకు ఖాతాలు తెరవాలన్నా, కొత్త ఓటరు కార్డు నమోదు చేసుకోవాలన్నా, సంక్షేమ పథకాలు పొందాలన్నా, ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలన్నా, పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నా ఇలా ఒకటి కాదు సమస్త పనులకు ఈ కార్డు అవసరం ఎంతో ఉంది. ప్రతి పనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆధార్‌ను అనుసంధానం చేయడం తెలిసిందే. గతంలో ఆధార్‌లో మార్పులు, చేర్పులు జరగాలంటే ఎక్కడికి వెళ్లాలో.. ఏం చేయాలో తెలియక ప్రజలు నానా ఇబ్బందులు పడేవారు. ప్రతి పదేళ్లకు ఆధార్‌ను అప్‌డేట్ చేయాల్సి ఉందని కేంద్ర ప్రభుత్వం నిబంధన విధించడం విధితమే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి ఆధార్ సేవలను తీసుకొచ్చింది. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వార్డు సచివాలయాల ద్వారా ఆధార్ సేవలను చెంతకు తీసుకొచ్చారు. ఆధార్ కార్డు తీసుకుని గత పదేళ్లలో ఎటువంటి మార్పులు, చేర్పులు చేయని వారంతా ఇప్పుడు విధిగా అప్‌డేట్ చేసుకుంటున్నారు. గతంతో పోలిస్తే సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులోకి రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

51, 50 వార్డుల్లో..

ఆధార్ వచ్చిన కొత్తలో కార్డులు చేయించుకున్న వారు, వాటిలోని తప్పులు, పొరపాట్లు, సవరణలు చేయించలేని వారు అనేకం. ఇప్పుడు సచివాలయాల్లో ప్రభుత్వం ఆధార్ సవరణల కోసం ఒక ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసింది. జీవీఎంసీ 51వ వార్డులోని అంబేడ్కర్ కాలనీ 287 సచివాలయం, మాధవధార 289 సచివాలయం, 290 గాంధీనగర్-3 సచివాలయాల్లో నిత్యం ఆధార్ సేవలు అందుబాటులో ఉన్నాయి. అంబేడ్కర్ కాలనీలో ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందిస్తున్నారు. రోజూ సుమారు 20 మందికి పైగా ప్రజలు తమ ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించుకుంటారు. 50వ వార్డు సచివాలయాల్లో కూడా ఆధార్ నమోదు ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. ప్రతి కేంద్రంలోనూ రోజూ ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకుంటున్నారు.

రుసుములు ఇవే..

ఆధార్‌కు మొబైల్ నంబర్, ఈ-మెయిల్ అనుసంధానం, పేరు, పుట్టిన తేదీ, చిరునామాలో మార్పులు, డాక్యుమెంట్ అప్‌డేట్ నిమిత్తం రూ.50 చెల్లించాలి. బయోమెట్రిక్, ఐరిష్, ఫొటో నమోదు నిమిత్తం రూ.100 చెల్లించాల్సి ఉంది. ఇక తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ నిమిత్తం రూ.100, మూడు లేదా అంతకన్నా ఎక్కువ సర్వీసులకు రూ.100 చెల్లించాలి. ఆధార్ కొత్త నమోదు, బాల ఆధార్, ఐదు నుంచి ఏడేళ్లు, 15 నుంచి 17 ఏళ్ల వారికి తప్పనిసరి బయోమెట్రిక్ ఉచితంగా చేస్తారు.

ప్రత్యేక శిబిరం..

ఈ నెల 22న మొదలైన ఆధార్ ప్రత్యేక శిబిరాలు 25వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతాయి.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

సచివాలయాల్లో ఆధార్ సేవలు కూడా అందిస్తున్నాం. ప్రభుత్వం తరచూ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. వలంటీర్ గ్రూపుల ద్వారా ఎప్పటికప్పుడు ఆధార్ సమాచారం ప్రజలకు చేరువయ్యేలా చూస్తున్నాం. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.భానుచందర్, అడ్మిన్, అంబేడ్కర్ కాలనీ సచివాలయం

చంద్రయాన్-3 సక్సెస్.. స్ఫూర్తిదాయకం


చంద్రయాన్-3 లాంచింగ్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షిస్తున్న ఎన్ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థులు


జాతీయ జెండా పట్టుకుని విజయోత్సవం నిర్వహిస్తున్న మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

సీతమ్మధార: చంద్రయాన్-3 చరిత్ర సృష్టించింది. జాబిల్లిపై ఇప్పటి వరకు ఏ దేశం దిగని దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ కాలుమోపి భారత శక్తిని ప్రపంచానికి చాటింది. ఇస్రో చంద్రయాన్-3 లాంచింగ్ విజయవంతమవడంతో దేశ కీర్తి పతాకం అంతరిక్షంలో రెపరెపలాడింది. ఇంతటి గొప్ప విజయం, విషయం యువతలో స్ఫూర్తి నింపుతుందని పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో బుధవారం సాయంత్రం చంద్రయాన్-3 ల్యాండింగ్ సక్సెస్‌ను విద్యార్థులకు డిజిటల్ టీవీల ద్వారా ఉపాధ్యాయులు చూపించి అవగాహన కల్పించారు.

వాకర్స్ క్లబ్ సభ్యుల విజయోత్సవం

తాటిచెట్లపాలెం: చంద్రయాన్-3 సక్సెస్ కావడంతో మురళీనగర్ వాకర్స్ క్లబ్ సభ్యులు విజయోత్సవం నిర్వహించారు. సీనియర్ సభ్యులంతా త్రివర్ణ పతాకాన్ని చేతబూని ఒకరికొకరు అభినందనలు తెలుపుకున్నారు. అనంతరం మిఠాయిలతో సంతోషాన్ని పంచుకున్నారు. వేడుకల్లో సుమారు 80, 90 ఏళ్ల వయసు గల పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, కేజీ కృష్ణారావులతోపాటు ప్రస్తుత అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రథమ మేయర్ సేవలు మరువలేనివి


ఎన్ఎస్ఎన్ రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ హరివెంకటకుమారి తదితరులు

సీతమ్మధార: విశాఖపట్నం ప్రథమ మేయర్ ఎన్ఎస్ఎన్ రెడ్డి సేవలు మరువలేనివని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఎన్ఎస్ఎన్ రెడ్డి 32వ వర్ధంతి సందర్భంగా బుధవారం జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా సెంట్రల్ పార్కు వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1981లో ప్రథమ మేయర్‌గా ఎన్ఎస్ఎన్ రెడ్డి విశాఖ నగరాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ఆయన హయాంలో రోడ్ల విస్తరణ, తాగునీరు, విద్యుత్తు, పారిశుధ్యం, పార్కుల అభివృద్ధికి మొదటి ప్రాధాన్యమిచ్చారన్నారు. జనతా పార్టీ తరఫున 1978లో శాసన సభ్యుడిగా పనిచేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎన్ రెడ్డి స్మారక ట్రస్ట్ అధ్యక్షుడు నీలాపు వివేకానందరెడ్డి, కుటుంబ సభ్యులు నీలాపు స్వర్ణలత, నీలాపు సుధీర్‌రెడ్డి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, వేమన సంక్షేమ సంఘం సభ్యులు, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో డైనింగ్ హాల్ ప్రారంభం


డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న రంగారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్‌ను బుధవారం ఆంధ్రా పెట్రో కెమికల్స్ డైరెక్టర్ ఎం.ఎస్.ఆర్.వి.కె. రంగారావు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ యువత గ్రంథాలయంలోని సదుపాయాలను సద్వినియోగం చేసుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని కోరారు. గ్రంథాలయ పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ అధ్యక్షత వహించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ భోజన శాల, ఇతర నిర్మాణాలకు ఆర్థిక సాయం అందించిన ఆంధ్రా పెట్రో కెమికల్స్ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ముందుగా డైరెక్టర్ రంగారావు, ప్రెసిడెంట్ కె.నరసప్ప గ్రంథాలయంలోని వివిధ విభాగాలను సందర్శించారు. లైబ్రరీ ద్వారా విశాఖ పౌర సమాజానికి, యువతకు అందిస్తున్న సేవలను కొనియాడారు. డి.ఎస్.వర్మ కృషిని అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు ఆచార్య ప్రసన్నకుమార్, బి.ఎస్.శాస్త్రి, సంయుక్త కార్యదర్శి డి.వి.సూర్యారావు, గ్రంథపాలకులు దుర్గారాణి పాల్గొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న మృణ్మయ గణనాథులు


మట్టి గణపతి విగ్రహ తయారీలో కళాకారుడు


రామచంద్రానగర్‌లో రూపుదిద్దుకుంటున్న మట్టి వినాయకులు

సీతంపేట: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలకు మండపాల్లో కొలువుదీరేందుకు వివిధ ఆకృతుల్లో పర్యావరణ హితంగా గణనాథుని విగ్రహాలు రూపొందుతున్నాయి. ప్రతి ఏటా వినాయక చవితికి రెండు నెలల ముందు నుంచే కోల్‌కత్తా నుంచి కళాకారులు నగరానికి వచ్చి ఎకో ఫ్రెండ్లీ వినాయక ప్రతిమలు తయారు చేస్తుంటారు. ఈ ఏడాది కూడా వినాయక విగ్రహాల తయారీలో వారు నిమగ్నమయ్యారు. సరుగుడు కర్రలు, వరి గడ్డి, మట్టి, హానికరం కాని రంగులను ఉపయోగించి వినాయక ప్రతిమలను తయారు చేస్తుంటారు. అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్‌లోని రామచంద్రానగర్‌లో, శంకరమఠం సమీపంలో, శంకరమఠం రోడ్డు నుంచి 80 ఫీట్ రోడ్‌లో మట్టి గణపతి విగ్రహాలను రూపొందిస్తున్నారు. రెండడుగుల నుంచి 15 అడుగుల ఎత్తు వరకు మృణ్మయ గణనాథులను కళాకారులు సిద్ధం చేస్తున్నారు. 20 నుంచి 25 రకాల ఆకృతుల్లో విగ్రహాలను తయారు చేస్తున్నామని, మండపాల్లో పూజించడానికి కొంత మంది యువత వారు చెప్పిన మోడల్‌లో వినూత్నంగా తయారు చేసి ఇమ్మని తమ వద్దకు వస్తుంటారని తయారీదారుడు పాల్ తెలిపారు.

డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్ఎం తనిఖీలు


డీజిల్ లోకోషెడ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజినల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించి, అందుబాటులో గల వసతులు, పరికరాలను పరిశీలించారు. డీజిల్ లోకోలకు క్లచ్ ఒబర్ హాలింగ్ చేసే పవర్ అసెంబ్లీ బెంచ్‌ను పరిశీలించారు. అనంతరం స్మాల్ మోటార్ బెంచ్ సెక్షన్, మెటలర్జికల్ ల్యాబ్, న్యూ షెడ్‌లను పరిశీలించారు. ఆయా విభాగాల్లో గల సీనియర్ సూపర్‌వైజర్స్‌తో డీఆర్ఎం మాట్లాడారు. డీజిల్ లోకో షెడ్ నిర్వహిస్తున్న వివిధ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

బీచ్‌రోడ్డు: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన 33 ఏళ్ల రాష్మిత అదృశ్యమైంది. మానసిక పరిస్థితి బాగోలేక ఈ నెల 10న ఆమెను కుటుంబ సభ్యులు మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఆమెకు వైద్యం అందించేందుకు సిబ్బంది వెళ్లగా.. రాష్మిత కనిపించలేదు. దీంతో సిబ్బంది మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె 5.5 అడుగుల ఎత్తు, తెలుపు రంగులో ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: కామర్స్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు క్యాపిటల్ మార్కెట్‌పై అవగాహన అవసరమని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ డీజీఎంఎస్ విభాగంలో బుధవారం నిర్వహించిన క్యాపిటల్ మార్కెట్స్ మ్యూచువల్ ఫండ్స్ అండ్ కెరీర్ ఆపర్చునిటీస్ సదస్సులో ఆయన మాట్లాడారు. మార్కెట్‌లో మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, తద్వారా పెట్టుబడులు, నష్టాల నియంత్రణ అంశాలపై అవగాహన కలుగుతుందన్నారు. పెట్టుబడులు పెట్టే వారికి తగిన సూచనలిస్తూ, మ్యూచువల్ ఫండ్స్ ఎంత వరకు శ్రేయస్కరమనే అంశాన్ని వివరించారు. ఐఎస్‌సీఏ పూర్వ సీఈవో డాక్టర్ ఇ.ఎస్.రావు మాట్లాడుతూ దేశంలో మౌలిక రంగాలు గణనీయంగా వృద్ధి సాధిస్తున్నాయన్నారు. ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.ఎస్.రావు మాట్లాడుతూ యువత చిన్నతనం నుంచి పొదుపు చేయడం అలవాటుగా చేసుకుంటే దేశ ఆర్థిక వ్యవస్థకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. స్ట్రాటడిగ్స్ ఎడ్యుకేషన్ సీఈవో బి.త్యాగరాజన్ మాట్లాడుతూ బీఎఫ్ఎస్ఐ రంగంలో ఉపాధి అవకాశాలను వివరించారు. సదస్సు సంచాలకుడు ఆచార్య బి.మోహన వెంకటరామ్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. జలాభిషేకం కోసం పసుపు నీటి బిందెలతో భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ముందుగా ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకంతోపాటు పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి భక్తులు తమ స్వహస్తాలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి పసుపు, కుంకుమతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఆలయ సిబ్బంది ప్రసాదం అందజేశారు.

ఏయూతో ఐసీటీ అకాడమీ ఎంవోయూ


అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఏయూ, ఐసీటీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఐసీటీ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసీటీ అకాడమీ సీఈవో హరి బాలచంద్ర సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఐసీటీ అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవసరమైన సేవలను ఐటీసీ అందిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు పొందే అవకాశం ఉంది. ఏయూ ఆచార్యుల పరిశోధన పత్రాలను ఐసీటీ జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకర రావు, మీడియా రిలేషన్స్ డీన్ ఆచార్య చల్లా రామకృష్ణ, ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ దినకర్ రెడ్డి, రీజినల్ మేనేజర్ బి.ప్రవీణ్ కుమార్, ఏయూ అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జేకేసీ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు ప్రముఖ కంపెనీలైన ఆటోస్పైస్, టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్, అరబిందో ఫార్మా, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, పేటీఎం, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్ సీసాట్ పాల్గొన్న ఈ జాబ్‌మేళాకు 286 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 66 మంది ప్లేస్‌మెంట్ పొందినట్టు జేకేసీ మెంటార్ వీఎస్ రాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డి.అరుణపద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూజీడీ మ్యాన్‌హోల్ పరిశుభ్రం


బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేస్తున్న యూజీడీ సిబ్బంది

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్‌ను శుభ్రం చేశారు. ఈ సమస్యపై 'రోడ్డెక్కిన మురుగు' శీర్షికన బుధవారం 'సాక్షి' లో ప్రచురించిన వార్తకు జీవీఎంసీ యూజీడీ విభాగం అధికారులు తక్షణం స్పందించారు. వారి ఆదేశాలతో సిబ్బంది యూజీడీ క్లీనింగ్ వాహనాన్ని తీసుకొచ్చి మ్యాన్‌హోల్‌ను శుభ్రపరిచారు. అధికారులు వెంటనే చర్యలు చేపట్టడంతో స్థానికులు హర్షం చేశారు.

సాక్షి ఎఫెక్ట్..

రోడ్డు మధ్యలో బండరాళ్ల తొలగింపు


పొక్లెయిన్‌తో బండరాళ్లను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

సీతమ్మధార: స్థానిక ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వెనుక రోడ్డు మధ్యలో ఉన్న బండరాళ్లను జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. నెల రోజులుగా ఈ రోడ్డు మధ్యలో బండరాళ్లు ఉండటంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఆక్సిజన్ టవర్స్ ఎదురుగా రోడ్డులో వాహనాలు యూటర్న్ తీసుకునే సమయంలో ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ సమస్యపై 'రోడ్డు మధ్యలో బండరాళ్లతో ఇక్కట్లు' అనే శీర్షికన బుధవారం 'సాక్షి'లో వెలువడిన వార్తకు అధికారులు తక్షణం స్పందించారు. పొక్లెయిన్‌తో సిబ్బంది రాళ్లను తొలగించడంతో వాహన చోదకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు


ప్రతిభా పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ షైజీ, అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు ఉత్సాహంగా సాగాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే దిశగా ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలోని సుమారు 15 కళాశాలలకు చెందిన విద్యార్థులు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథా వాచనం మొదలగు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో వీటిని నిర్వహించారు. డాక్టర్ పి.అరుణాదేవి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. సెయింట్ జోసెఫ్, డాక్టర్ వీఎస్ కృష్ణ, గాయత్రి, వినెక్స్, యూనిటీ కళాశాలలు విజేతలుగా నిలిచాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరావు, గౌరీనాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రహదారులు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన


చాకలిపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి, కార్పొరేటర్ ఆళ్ల లీలావతి

తాటిచెట్లపాలెం: దక్షిణ నియోజకవర్గ పరిధి 42వ వార్డు రైల్వే న్యూకాలనీ చాకలిపేటలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శంకుస్థాపన చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ పనుల్లో భాగంగా కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు 235 సచివాలయం పరిధి ప్రాంతంలో డ్రైనేజీలు, రోడ్లు నిర్మించేందుకు రూ.19.98 లక్షల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, డైరెక్టర్ సకలాభక్తుల ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ సీనియర్ నాయకులు ఆళ్ల శ్రీనివాస్, రాజపాత్రుడు, అజయ్‌రెడ్డి, జీవీఎంసీ ఏఈ రమణమ్మ, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

భారీ గణేషుడి విగ్రహం ఏర్పాటుకు శ్రీకారం


దొండపర్తి రామాలయం వద్ద పూజలు చేస్తున్న నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార: వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం దొండపర్తిలోని రామాలయం వద్ద భారీ గణనాథుడి విగ్రహం ఏర్పాటు పనులు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, టీం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వెస్ట్ బెంగాల్ ఖరగ్‌పూర్‌కు చెందిన కళాకారుడు శక్తి పాల్ బృందం చేత భారీ విగ్రహం తయారు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. గతేడాది 102 అడుగుల గణపతి ఏర్పాటు చేసినట్లు సర్వేశ్వరరెడ్డి తెలిపారు. 21 రోజుల పాటు విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబర్ 18న వినాయక చవితి సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సర్వేశ్వరరెడ్డి అండ్ టీం సొంత నిధులు రూ.5 లక్షలతో భారీ గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మధురెడ్డి, అజయ్ రెడ్డి, శివ, గురుమూర్తిరెడ్డి, సతీష్, అశోక్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి


ఎర్రయ్య మృతదేహం

మల్కాపురం: చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన ఓ వ్యక్తి.. అదే చోట శవమై తేలాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వన్‌టౌన్ రెల్లివీధి ప్రాంతానికి చెందిన మారుపల్లి ఎర్రయ్య(37) ఈ నెల 20న ఎస్‌బీసీ(షిప్ బిల్డింగ్ సెంటర్) ఎదురుగా డాక్‌యార్డ్ వంతెన వద్ద చేపలు పట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అతను అక్కడి సముద్ర తీరంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని అతనితో వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో.. ప్రత్యేక బృందాన్ని రప్పించారు. సోమ, మంగళవారాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. చివరకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఎర్రయ్య మృతదేహం నీటిపైకి తేలింది. ఈ విషయాన్ని పోలీసులు అతని బంధువులకు తెలిపి.. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసును ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు. కాగా. ఎర్రయ్య మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారితో ఎర్రయ్య కలిసి ఉండటం లేదని సమాచారం.